సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 3 । నవంబర్ । 2024



కాషాయ జెండా ఎగరాలి

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి శనివారం నియోజకవర్గంలోని పలు గ్రామాలలో పర్యటించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
35.0 /19.6

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

గట్టి బందోబస్తు నిర్వహించాలి



మద్నూర్: మద్నూర్ మండలం రాష్ట్ర సరిహద్దులో ఉన్నందున మరింత పటిష్టంగా బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆమె తనిఖీ చేశారు. స్టేషన్‌లోని గదులు, సిబ్బంది క్వార్టర్లను పరిశీలించారు. కేసుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ పెంచాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే అదుపులోకి తీసుకొని విచారించాలన్నారు. అక్రమంగా మద్యం విక్రయించినా, పేకాడినా కేసులు నమోదు చేయాలని సూచించారు. ఆమె వెంట బిచ్కుంద సీఐ నరేశ్, ఎస్సై విజయ్‌కొండ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

క్రైం రేటు తగ్గించాలి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పోలీస్ సర్కిల్ పరిధిలో క్రైం రేటు తగ్గేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. శనివారం ఎల్లారెడ్డి సీఐ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అల్ప్రాజోలం సరఫరా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ చలాన్లు క్లియర్ చేయాలన్నారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆమె వెంట సీఐ రవీందర్‌నాయక్, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

బాధ్యతలు స్వీకరించిన గడుగు గంగాధర్

నిజామాబాద్ సిటీ : రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోగల వ్యవసాయ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కమిషన్ తొలి సమావేశం చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించినట్లు గడుగు గంగాధర్ తెలిపారు.

బలగం



గాంధారిలో హరాళే కుటుంబం ఇల్లు

- పండుగలొస్తే ఇళ్లంతా సందడే
- ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి కుటుంబాలు

సండే స్పెషల్

ఒకప్పుడు అన్ని కుటుంబాలు ఉమ్మడిగానే ఉండేవి. అందరూ కలసిమెలసి జీవనం సాగించేవారు. కొన్ని కుటుంబాల్లో అయితే నాలుగైదు తరాలు కూడా వేరుపడకుండా ఒకే ఇంట్లో కలిసి జీవించేవారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్న క్రమంలో.. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్నగా మారిపోయాయి. అయితే ఈ కాలంలోనూ కొన్ని కుటుంబాలు ఉమ్మడిగానే జీవనం సాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. పండుగలొచ్చాయంటే వారి ఇళ్లలో జాతర కనిపిస్తుంది. శుభకార్యాలలో ఆ ఇళ్లలో హంగామా అంతాఇంతా కాదు.. మూడు నాలుగు తరాలుగా విడిపోకుండా ఒక్కటిగా ఉంటున్న కుటుంబాలపై సండే స్పెషల్..

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



అడ్వీలింగాలకు చెందిన కంచర్ల సరోజన, వెంకట్రాములు పరివారం

కంచర్ల పరివారం..

ఎల్లారెడ్డి మండలం అడ్వీలింగాలకు చెందిన కంచర్ల సరోజన, వెంకట్రాములుకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. ఆయనతోపాటు సోదరి సుశీల, బావ గోవింద్ కూడా కలిసి ఉండేవారు. వారికి ఐదుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. వెంకట్రాములుతోపాటు ఆయన భార్య, సోదరి, బావ కాలం చేశారు. ప్రస్తుతం ఆ ఇంట్లో 31 మంది ఉన్నారు. వెంకట్రాములు పెద్ద కుమారుడు కంచర్ల బాలకిషన్ ఆధ్వర్యంలో కుటుంబ వ్యవహారాలు నడుస్తున్నాయి. వెంకట్రాములు సంతానం మేనత్త కుమారులను బావ అని కాకుండా అన్న అనే సంబోధిస్తారంటే వారు ఎంతలా కలిసిపోయారో అర్థమవుతుంది. మొదట్లో అంతా ఎల్లారెడ్డిలోనే ఉంటూ వ్యాపారాలు చూసుకునేవారు. అనంతరం ఉద్యోగాలు, వ్యాపారాలరీత్యా కొందరు కామారెడ్డికి, మరికొందరు హైదరాబాద్‌కు మకాం మార్చారు. అయితే పండుగలకు తప్పనిసరిగా ఎల్లారెడ్డికి చేరుకుంటారు. ఫంక్షన్లు మాత్రం కామారెడ్డిలోని ఇంట్లో జరుపుకుంటారు.

దేవుడిచ్చిన కుటుంబం



మా ఇంట్లో అమ్మానాన్నలతో పాటు మేనత్త, మామయ్య వాళ్లకూడా ఉండేవారు. మాతోపాటు మేనత్త పిల్లలం అంతా కలిపి పదిమందిమి. మా సొంతూరు అడ్వీలింగాలలో ఆవులున్నాయి. అప్పుడప్పుడు అక్కడికి వెళ్తుంటాం. పండగలకు తప్పనిసరిగా ఎల్లారెడ్డిలోని ఇంట్లో కలుస్తాం. బర్త్‌డేలు, ఇతర చిన్నచిన్న ఫంక్షన్లు కామారెడ్డిలో జరుపుకుంటాం. అందరం ఎంతో అన్యోన్యంగా ఉంటాం. కరోనా సమయంలో అమ్మానాన్నతో పాటు మేనత్త కూడా చనిపోవడం మాకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

-కంచర్ల లింగం, ఎల్లారెడ్డి

కలిసి ఉంటే కలదు సుఖం..



మాది ఉమ్మడి కుటుంబం. అందరం కలసిమెలసి ఉంటాం. కలిసి ఉంటే కలదు సుఖం అన్నట్టు మా కుటుంబంలో ఒకరికి ఒకరం ధైర్యం. పిల్లలు, పెద్దలు అందరూ కలిసి ఉంటారు. ఎక్కడ ఉన్నా పండుగలు, ఫంక్షన్లకు తప్పనిసరిగా కలుస్తాం.

-కంచర్ల బాలకిషన్, ఎల్లారెడ్డి



గాంధారికి చెందిన హరాళే రత్నాబాయి, కిషన్‌రావు పరివారం

హరాళే ఫ్యామిలీ..

గాంధారి మండల కేంద్రానికి చెందిన హరాళే రత్నాబాయి, కిషన్‌రావు దంపతులకు నలుగురు కుమారులు, ఒక కూతురు. వాళ్లందరికీ ఇద్దరు చొప్పున పిల్లలు. కిషన్‌రావు కాలం చేశారు. రత్నాబాయి నలుగురు కుమారులు, కోడళ్లు, మనవలు, మనవరాళ్లతో కలిసి ఉంటోంది. ఆమె కుటుంబంలో 20 మంది ఉన్నారు. పిల్లలు చదువుల కోసం కామారెడ్డి, హైదరాబాద్‌లలో ఉంటున్నా.. పండుగలు, ఫంక్షన్ల సమయంలో అందరూ ఇంటికి చేరుకుంటారు. ఇటీవల ఊళ్లో పెద్ద ఇల్లు నిర్మించారు. అందులో నలుగురు అన్నదమ్ములకు నాలుగు బెడ్‌రూంలు, వాళ్ల వారసులకు ఐదు బెడ్‌రూంలు ఉన్నాయి.

పొరపొచ్చాలకు తావు లేదు



మేం నలుగురం అన్నదమ్ములం. మా ఇంటి కోడళ్లు కూడా సొంత అక్కాచెల్లెళ్లలా ఉంటారు. అందరూ మహారాష్ట్ర నుంచి వచ్చిన వారే. మా చెల్లెలిని కూడా మహారాష్ట్రకు ఇచ్చాం. మా మధ్య ఎలాంటి పొరపొచ్చాలకు తావులేదు. ఈ మధ్యే కొత్త ఇల్లు కట్టుకున్నాం. నలుగురు అన్నదమ్ములకు బెడ్ రూంలు, అలాగే మా పిల్లలకూ పెళ్లిళ్లయ్యాక ఇబ్బందులు రావొద్దని వాళ్లకూ బెడ్‌రూంలు కట్టించాం. మాదంతా శాకాహార కుటుంబం. అందరం కలిసి ఉంటే ఆ ఆనందమే వేరుగా ఉంటుంది.

– హరాళే తానాజీరావ్, గాంధారి

ఉప్పల కుటుంబం..

కామారెడ్డికి చెందిన ఉప్పల గంగలక్ష్మి, నాగభూషణంలకు నలుగురు కుమారులు. నలుగురికీ పెళ్లీడుకొచ్చిన పిల్లలున్నారు. ఇందులో ఇద్దరికి వివాహమై పిల్లలూ ఉన్నారు. నాగభూషణం మరణించారు. ప్రస్తుతం వారి కుటుంబంలో 20 మంది సభ్యులున్నారు. అందరి మాట ఒకటే అన్నట్టుగా ఉంటారు. అందరూ ఒకే ఇంట్లో కలిసి ఉంటుండడంతో నాలుగు తరాల వారితో ఆ ఇల్లు నిత్యం కళకళలాడుతుంటుంది. పండుగలు, శుభకార్యాల రోజున మరింత సందడిగా మారుతుంది. బతుకమ్మ ఆడడానికైనా, ఫంక్షన్లకయినా నలుగురు తోటి కోడళ్లు కలిసే వెళతారు.

అమ్మ చెప్పినట్టే నడుచుకుంటాం



మా నాన్న ఎప్పుడో చనిపోయారు. అమ్మ ఏది చెబితే అదే మాకు వేదవాక్కు. అమ్మదయ, ఆశీర్వాదమే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది. నలుగురం అన్నదమ్ములమే కాదు.. మా నలుగురి భార్యలు, పిల్లలు కూడా అందరూ కలసిమెలసి ఉంటారు. పండుగలు, శుభకార్యాల సమయంలో ఇంట్లో ఎంతో సందడిగా ఉంటుంది. ఇక ముందు కూడా కలిసే ఉంటాం.

-ఉప్పల శ్రీధర్, కామారెడ్డి



కామారెడ్డికి చెందిన ఉప్పల గంగలక్ష్మి, నాగభూషణం పరివారం

నాణ్యమైన బోధన అందిస్తున్నాం

- ఫస్టియర్‌లో మంచి ఫలితాలు సాధించాం
- హాస్టల్ భవనం లేక రెండో బ్యాచ్‌కు ఆన్‌లైన్‌లో తరగతులు
- 'సాక్షి'తో కామారెడ్డి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ శివప్రసాద్



సాక్షి ఇంటర్వ్యూ

కామారెడ్డి టౌన్ : ''కామారెడ్డి మెడికల్ కాలేజీలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది. అందుకే ఫస్టియర్‌లో 97 శాతం ఉత్తీర్ణులయ్యారు. అలాగే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తున్నాం'' అని కామారెడ్డి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ శివప్రసాద్ పేర్కొన్నారు. కళాశాలలో రెండో బ్యాచ్ అడ్మిషన్ల ప్రక్రియ చివరి దశకు చేరిన క్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌తో 'సాక్షి' ముచ్చటించింది. ఆ వివరాలు..

సాక్షి: మొదటి బ్యాచ్‌లో ఎంతమంది ఉత్తీర్ణులయ్యారు?

ప్రిన్సిపల్: కళాశాలలో నాణ్యమైన బోధన సాగుతోంది. మొదటి బ్యాచ్‌కు సంబంధించిన విద్యార్థులు 2023–24లో ఉత్తమ ఫలితాలు సాధించారు. కళాశాలలో 99 మంది విద్యార్థులు చేరగా.. ఒకరు అనారోగ్యంతో మరణించారు. మొదటి సంవత్సరంలో 96 మంది ఉత్తీర్ణులై ద్వితీయ సంవత్సరంలోకి అడుగిడారు.

■ రెండో బ్యాచ్‌లో ఎంతమంది జాయిన్ అయ్యారు?

● ఇటీవల రెండో ఫేజ్ మెడిసిన్ కౌన్సెలింగ్ పూర్తయ్యింది. 62 మంది బాలికలు, 36 మంది బాలురు జాయిన్ అయ్యారు. మిగిలిన రెండు ఆల్‌ఇండియా స్థాయి సీట్లు. అవి కూడా మూడో ఫేజ్‌లో భర్తీ అవుతాయి.

■ హాస్టల్ భవనాలు ఉన్నాయా?

● రెండోబ్యాచ్‌లో చేరిన విద్యార్థులకు వసతి కల్పించడం కోసం భవనాలను వెతుకుతున్నాం. అనువైన హాస్టల్ భవనం లభించకపోవడంతో విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకు ఈనెల 6నుంచి ఆన్‌లైన్ ద్వారా తరగతులు నిర్వహించాలని నిర్ణయించాం. గర్ల్స్, బాయ్స్‌కు వేర్వేరుగా భవనాలు లభించగానే రెగ్యులర్ తరగతులు ప్రారంభిస్తాం.

■ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొరతను ఎలా అధిగమిస్తున్నారు?

● ప్రధానంగా గైనిక్ విభాగంలో 8 పోస్టులకుగాను ఒక్క ప్రొఫెసరే అందుబాటులో ఉన్నారు. జనరల్ మెడిసిన్‌లో ఆరు పోస్టులకుగాను ఒకరు, మైక్రోబయాలజీలో నాలుగు పోస్టులకుగాను ఒక్కరే ఉన్నారు. అయినా ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నాం. వైద్యుల కొరతతో ప్రొఫెసర్లు కూడా నైట్ డ్యూటీలు చేయాల్సి వస్తోంది. 28 వైద్య పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయడం కోసం రెండు నెలల క్రితం నోటిఫికేషన్ విడుదల చేశాం. అయితే ముగ్గురు మాత్రమే ఆసక్తి చూపారు. మరో ఆరు నెలల్లో నూతన ఎస్‌ఆర్‌లు వస్తారు. ఆ తర్వాత ఇబ్బందులుండవు.

■ కళాశాలకు అనుబంధంగా పారామెడికల్ కోర్సులేమైనా ప్రారంభిస్తారా?

● కళాశాలకు అనుబంధంగా ఈసారి పారామెడికల్ బోర్డు తరఫున ఈసీజీ టెక్నీషియన్, డీఎంఎల్‌టీ కోర్సులను ప్రారంభించనున్నాం. ఆయా కోర్సుల్లో 30 చొప్పున సీట్లు భర్తీ చేస్తారు. త్వరలో వారికి కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నాం.

■ కళాశాలలో ఏవైనా సమస్యలున్నాయా?

● జిల్లా జనరల్ ఆస్పత్రి భవనం ఇరుకుగా ఉండడంతో కాస్త ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థులకు హాస్టల్ భవన సమస్య ఉంది. వచ్చే ఏడాదిలో కళాశాల నూతన భవన నిర్మాణం పూర్తవుతుంది. భవన నిర్మాణం పూర్తయితే ఇబ్బందులు తీరుతాయి. వైద్య పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ అయితే మరింత మెరుగ్గా సేవలందించగలం.

కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి

- బ్యాంకు గ్యారంటీ ఇస్తేనే మిల్లులకు వడ్లు కేటాయించాలి
- ధాన్యం నిల్వ చేసేందుకు గోదాములను సిద్ధం చేయండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, జిల్లా అధికారులు

కామారెడ్డి క్రైం: ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నరకం వడ్ల కొనుగోలు కేంద్రాలకు దొడ్డు రకాలు తీసుకురాకుండా చూడాలన్నారు. మిల్లర్లు తాలు పేరుతో ఎలాంటి ధాన్యం కోతలు చేయకుండా చూడాలని సూచించారు. రైస్‌మిల్లర్‌లకు ధాన్యం కేటాయింపులు చేయాలంటే బ్యాంకు గ్యారంటీ తప్పనిసరన్నారు. రైస్‌మిల్లర్‌లతో సమావేశాలు నిర్వహించి బ్యాంక్ గ్యారంటీలపై అవగాహన కల్పించాలన్నారు. బ్యాంక్ గ్యారంటీ తీసుకున్న తర్వాతే ధాన్యం కేటాయించాలన్నారు. లేనిపక్షంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు అవసరమైన గోదాంలను సిద్ధం చేయాలని సూచించారు. కొనుగోళ్ల కోసం ప్రతి జిల్లాలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు.

కొనుగోళ్లకు సంబంధించి జిల్లాలో చేపట్టిన చర్యలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, ఏఎస్‌వో నరసింహారావు, సహకార అధికారి రామ్మోహన్, డీఏవో తిరుమల ప్రసాద్, మార్కెటింగ్ అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేలో ప్రజలు భాగస్వాములవ్వాలి

- అన్ని పథకాలకు ఈ సర్వేనే ఆధారం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాటామంతి



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, వేదికపై ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాల్‌రాజ్

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో సమగ్ర సర్వేపై కాంగ్రెస్ శ్రేణులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఈనెల 6న సర్వే ప్రారంభమవుతుందన్నారు. భవిష్యత్తులో అన్ని పథకాలను ఈ సర్వేనే ప్రాతిపదిక అవుతుందన్నారు. దీని ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు ఉంటాయని పేర్కొన్నారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను కేంద్రం మోడల్‌గా తీసుకుని జనాభా గణన చేపట్టాలన్నారు. గతంలో కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఎక్కడ ఉన్నాయో తెలియదన్నారు. ఈనెల 6నుంచి చేపట్టబోయే కుటుంబ సర్వేను ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ ప్రారంభిస్తారని తెలిపారు.

సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రతి కుటుంబం పూర్తి వివరాలను అందించి సహకరించాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, బీసీ సంఘాల నేతలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోగనున్న పెళ్లి బాజా!

- శుభ ముహూర్తాలను మోసుకొచ్చిన కార్తీక మాసం
- నేటినుంచి జిల్లాలో విస్తృతంగా వివాహాలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కార్తీక మాసం వస్తూనే శుభ ముహూర్తాలను మోసుకొచ్చింది. ముందుగానే నిర్ణయించుకున్న ప్రకారం శుభ ముహూర్తాల్లో వేలాదిగా పెళ్లిళ్లు జరగనున్నాయి. ఆదివారం నుంచి మంచి ముహూర్తాలు ఉండడంతో చాలా మంది పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఎంగేజ్‌మెంట్స్, ఇతర కార్యక్రమాలకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో అంతటా సందడి నెలకొంది. మొన్నటి వరకు దసరా, దీపావళి పండుగల షాపింగ్‌లతో కళకళలాడిన వ్యాపార, వాణిజ్య సంస్థలు.. ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్‌తో కళకళలాడుతున్నాయి. ఈ నెల 3, 7, 8, 10, 13, 14, 17, 20 తేదీలలో ఎక్కువ సంఖ్యలో పెళ్లిళ్లు ఉన్నాయని లచ్చపేటకు చెందిన వేద పండితుడు శెట్‌పల్లి జయరాం శర్మ తెలిపారు. వచ్చేనెలలో 4, 5, 6, 11, 20, 25 తేదీలలో శుభముహూర్తాలు ఉన్నాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నూతన చట్టాలపై అవగాహన



కామారెడ్డి క్రైం: నూతన చట్టాలపై పోలీసు అధికారులకు కామారెడ్డి కోర్టులో శనివారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నేరాలకు సంబంధించి విచారణ, తనిఖీలు, సీజింగ్, అరెస్టులు, ఫొటోలు, వీడియోల సేకరణ తదితర అంశాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ దామోదర్‌రెడ్డి, ఏపీపీ అశోక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, దేవునిపల్లి రాజంపేట, భిక్కనూరు, రామారెడ్డి, సదాశివనగర్, బీబీపేట ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్నూర్‌లో దీపావళి వేడుకలు



మద్నూర్: మండలంలో గురువారం ప్రారంభమైన దీపావళి వేడుకలు శనివారం కూడా కొనసాగాయి. మద్నూర్ మండలం మహారాష్ట్ర సరిహద్దులో ఉండడంతో అక్కడి సంప్రదాయం ప్రకారం ఈ ప్రాంతంలోని ప్రజలు ఐదు రోజుల పాటు లక్ష్మి పూజలు కొనసాగిస్తారు. శనివారం ప్రతి ఇంటా దీపాలు వెలిగించి పటాకులు కాల్చారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సిందే మండల కేంద్రంలోని లక్ష్మీపూజల్లో పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల పాఠశాల తనిఖీ



కామారెడ్డి అర్బన్: స్థానిక మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలను జిల్లా సంక్షేమాధికారి దయానంద్ శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల గదులు, మరుగుదొడ్లు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ నాగరాజు, ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బందితో మాట్లాడి తగిన సలహాలు, సూచనలు చేశారు.

బాధిత కుటుంబానికి సునీల్‌రెడ్డి భరోసా



బాల్కొండ: ఉపాధి నిమిత్తం ఖతర్‌కు వెళ్లి బ్రెయిన్ స్ట్రోక్‌బారిన పడిన ముప్కాల్ మండలం నాగంపేట్‌కు చెందిన బదనాపల్లి సాయన్నకు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స చేయించేందుకు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సునీల్ రెడ్డి ఏర్పాట్లు చేశారు. సాయన్న చికిత్స కోసం ఎల్‌వోసీ ఇప్పించి ఉచితంగా చికిత్స అందేలా కృషి చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంబీఏలో ప్రవేశానికి నోటిఫికేషన్

నిజామాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఎంబీఏ ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు వర్సిటీ కో ఆర్డినేటర్ రంజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్లై చేసి దరఖాస్తులను స్టడీ సెంటర్‌లో ఇవ్వాలని సూచించారు. అలాగే డిగ్రీ, పీజీ ప్రవేశాల గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 73829 29612 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మంచు దుప్పటి





ఎల్లారెడ్డిలో కమ్ముకున్న పొగమంచు

జిల్లాను మంచు దుప్పటి కప్పేసింది. శుక్రవారం రాత్రి నుంచి భారీగా మంచు కురిసింది. శనివారం తెల్లవారుజామున దట్టంగా కమ్ముకోవడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు వీడలేదు.

– సాక్షి, నెట్‌వర్క్



గోపాల్‌పేటలో..



పెద్దకొడప్‌గల్‌లో.



గోపాల్‌పేటలో పొగమంచులోనే చెత్త సేకరిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

ఎంఎస్‌ఎన్ ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా



భిక్కనూరులోని ఎంఎస్‌ఎన్ కెమికల్ ఫ్యాక్టరీలో ధర్నా చేస్తున్న కార్మికులు

భిక్కనూరు: మండలంలోని ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీ కార్మికులు తమ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ శనివారం ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. భోజన విరామ సమయానికి అరగంటకు కుదించారని, తాము చేతులను శుభ్రం చేసుకునేందుకే ఇరవై నిమిషాల సమయం పడుతోందన్నారు. అలాగే పీఎఫ్ డబ్బులకు సంబంధించి తమకు ఎలాంటి పత్రాలను ఇవ్వడం లేదని, వేతనాలను పెంచడం లేదని, అదనంగా పని చేసినప్పుడు నిబంధనల ప్రకారం భోజన సౌకర్యం కల్పించాల్సి ఉన్నప్పటికీ తమ వేతనంలో నుంచి డబ్బులు కట్ చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. హెచ్‌ఆర్ సుబ్బారావు కార్మికుల వద్దకు వచ్చి మాట్లాడారు. ఫ్యాక్టరీ యాజమాన్యం వచ్చే వరకు ఆందోళనను విరమించేది లేదని కార్మికులు మొండి కేశారు. దీంతో ఫ్యాక్టరీ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీల హెచ్‌వోడీ మోహన్‌రావు భిక్కనూరుకు చేరుకుని కార్మికులతో మాట్లాడారు. ఐదురోజుల్లో తమకు లిఖిత పూర్వకంగా సమస్యలను తెలిపితే వెంటనే వాటిని పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికులు శాంతించారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాన్సువాడ: బాన్సువాడలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, మాసాని శేఖర్‌రెడ్డి, పాత బాలకృష్ణ, మల్లూరి సాయిలు, అక్బర్, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

పామాయిల్ సాగు చేయాలి

నిజాంసాగర్: దేవాదయ శాఖ ఆదీనంలో ఉన్న భూముల్లో పామాయిల్ పంటలు సాగు చేసేలా చూడాలని రాష్ట్ర దేవాదయశాఖ మంత్రి సురేఖను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కలిసి కోరారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రిని ఎమ్మెల్యే కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపి స్వీట్ బాక్స్ అందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చేపూర్‌వాసికి ఫార్మసీలో డాక్టరేట్

ఆర్మూర్: మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన సారంగి రమేశ్‌కు ఫార్మసీ రంగంలో చేసిన పరిశోధనలకుగాను డాక్టరేట్ లభించినట్లు కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ టెక్నాలజీ ఫార్మసీ విభాగంలో ప్రొఫెసర్ టీ పార్థసారథి పర్యవేక్షణలో క్యాన్సర్‌పై చేసిన డిజైన్ సన్ థీసిస్ అండ్ ఫార్మలోజికల్ ఎవల్యూషన్ ఆఫ్ నోవెల్ బయో ఇంటర్ కాలిక్యులేషన్స్ ఆస్ పాసిబుల్ యాంటీ క్యాన్సర్ ఏజెంట్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు రమేశ్ అందుకున్నాడని వివరించారు. రమేశ్ ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని విజయ్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రమేశ్ డాక్టరేట్ అందుకోవడంపై గ్రామస్తులతోపాటు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం అశోక్, బాస్ రమేశ్, వికాస్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ సీహెచ్ సాయిలు, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఉపేందర్ అభినందనలు తెలిపారు.

ఇరు కుటుంబాల గొడవ

- గర్భిణి పరిస్థితి విషమం
- వారం రోజులు గడిచినా పట్టించుకోని పోలీసులు

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో వారం రోజుల క్రితం ఇరు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. మండల కేంద్రానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కుటుంబీకులు దాడి చేయడంతో గర్భిణి పరిస్థితి విషమంగా మారింది. వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందిన గర్భిణి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో 'ప్రజాప్రతినిధి అమానుషం' అంటూ సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో ఒడ్డెర సంఘం ఎదురుగా అదే సంఘ సభ్యుడు అయిన నాగేశ్ అనే కుటుంబ సభ్యులు టీ దుకాణాన్ని గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్నారు. దీనిని మాజీ ప్రజాప్రతినిధి ఉన్నపలంగా తీసేయాలంటు తెలపడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో నాగేశ్ కోడలు గర్భిణి అయిన రాజేశ్వరికి దెబ్బలు తగిలాయి. నాటి నుంచి ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలిసినా పోలీసులు పట్టించుకోవడం లేదని బాధిత కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఏఎస్సై వెంకట్ రావును వివరణ కోరగా ఇరువర్గాల వారు ఫిర్యాదు ఇచ్చారని, పెద్ద మనుషుల మధ్య సమస్య పరిష్కారం చూపుతాము అనడంతో కేసు ముందుకు తీసుకోలేక పోయామన్నారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ పైనుంచి పడి ఒకరి మృతి

బోధన్‌రూరల్: మండలంలోని సంగం గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి పడి వర్ని మండలానికి చెందిన కాశీరాం (47) అనే వ్యక్తి మృతిచెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వర్ని మండలంలోని పాతవర్నికి చెందిన కాశీరాం ట్రాక్టర్ డ్రైవర్ హరీశ్‌తో కలిసి శనివారం ఉదయం సంగం శివారులో కూలీ పని వచ్చాడు. పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా పొలాల్లో నుంచి మెయిన్ రోడ్డుకు ట్రాక్టర్ ఎక్కుతుండగా డ్రైవర్ పక్కన కూర్చొని ఉన్న కాశీరాం ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ట్రాక్టర్ చక్రాలు పైనుంచి వెళ్లడంతో కాశీరాం అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కూతురు, కొడుకు ఉన్నారు.

ఒంటరితనాన్ని భరించలేక ఆత్మహత్య

కమ్మర్‌పల్లి: ఒంటరితనాన్ని భరించలేక జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన నేవూరి హన్మాండ్లు(65) భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందగా కుటుంబ సభ్యులకు దూరంగా ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. గత నెల 30వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన హన్మాండ్లు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. శనివారం గ్రామ శివారులోని పెద్దమ్మ తల్లి ఆలయం సమీపంలోని బర్రెల మంద వద్ద గ్రామస్తులకు హన్మాండ్లు మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఒంటరితనం కారణంగా జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కొడుకు నరేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

రైలు కిందపడి..

ఖలీల్ వాడి: నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని అర్సపల్లి వద్ద రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శనివారం తెలిపారు. రైల్వే స్టేషన్ మేనేజర్ రమేశ్ సమాచారం మేరకు శనివారం ఘటనాస్థలాన్ని పరిశీలించామని, మృతుడిని మోస్రా మండలంలోని గోవూరుకు చెందిన సోమ నర్సయ్య (42)గా గుర్తించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు రోజుల క్రితం రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ హెచ్ వో రఘుపతి తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు..



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో విజయలక్ష్మి గార్డెన్ వద్ద విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతిచెందాయి. మామిడిపల్లికి చెందిన ఆకుల రాజేశ్వర్ కు చెందిన ఓ గేదెతోపాటు మల్యాల పెద్ద భోజన్న అనే వ్యక్తికి చెందిన రెండు గేదేలు మృతి చెందాయి. సుమారు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. విద్యుత్, రెవెన్యూ, వెటర్నరీశాఖల అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా బాధితులు అధికారులను కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్: సాలూర, బోధన్ మండలంలోని గ్రామాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశామన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన కొండూరు గంగాధర్(55) కాకతీయ కాలువలో శుక్రవారం గల్లంతైన విషయం తెలిసిందే. నీటి విడుదలను నిలిపి వేసి గాలింపు చర్యలు చేపట్టగా శనివారం మృత దేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మెండోరా ఎస్సై నారాయణ తెలిపారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి బాన్సువాడలోని తన స్వగృహంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి రైస్‌మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రైస్‌మిల్లులకు అలాట్‌మెంట్ ఇవ్వడం జరిగిందని, కామారెడ్డి. నిజామాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలను పాటించి రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యాన్ని తీసుకోవాలని మిల్లర్లకు సూచించారు. సమావేశంలో రైస్‌మిల్లుల యజమానులు నాగులగామ వెంకన్న, సంతోష్, ఎల్లారెడ్డి, రషీద్, రాజేశ్వర్ నాయకులు ఉన్నారు.

మహిళాభివృద్ధిలో దేశానికే తెలంగాణ ఆదర్శం

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సదాశివనగర్: మహిళాభివృద్ధిలో దేశానికే తెలంగాణ ఆదర్శమని, మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజాప్రభుత్వం వడ్డీలేని రుణాలు ఇచ్చి మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దుతోందని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో చందర్ నాయక్, డీఆర్‌డీవో సురేందర్, ఆర్డీవో రంగనాథ్ రావు, ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీవో సురేందర్ రెడ్డి, సంగారెడ్డి, బొంబోతుల లింగాగౌడ్, మద్దెల బాగయ్య, గాదారి శ్రీనివాస్ రెడ్డి, రూపేందర్ రెడ్డి, సదాశివరెడ్డి, సంగ్యానాయక్, శోభ, రాజిరెడ్డి, ఆస సురేశ్, దత్తురావు, ఇర్షాదొద్దీన్, రాజన్న, జగ్గ బాల్‌రాజు, రాజేందర్, లింగారావు, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సదాశివనగర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు. మండలంలోని కుప్రియాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో అడ్లూర్ ఎల్లారెడ్డి విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, గాదారి శ్రీనివాస్‌రెడ్డి, రూపేందర్ రెడ్డి, సంగారెడ్డి, లక్ష్మాగౌడ్, అన్వేష్‌గౌడ్, సంగ్యానాయక్, ఇర్షదొద్దీన్, కృష్ణారెడ్డి, బత్తుల రాములు, ప్రవీణ్‌కుమార్ గౌడ్, ఆకుల విఠల్, జగ్గబాల్‌రాజు, రాజయ్య, రైతులు పాల్గొన్నారు.

సంక్రమణ వ్యాధులపై అవగాహన అవసరం

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి రూరల్/భిక్కనూరు: ప్రాణాంతకమైన సంక్రమణ వ్యాధులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా వైద్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్‌లో భాగంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు శనివారం హెచ్‌ఐవీ, రక్తదానంపై క్విజ్, పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి రాధిక, డీపీఎం సుధాకర్, డీఏపీ మహేశ్, సౌత్ క్యాంపస్ ప్రొఫెసర్ అంజయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బీబీపేట: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు టీఎస్ఎస్ఆర్ ఉన్నత పాఠశాలకు చెందిన దుంప హాసిని, మద్దూరి మారుతి అనే విద్యార్థులు ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లాలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవంద్రారెడ్డి శనివారం తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ ఆంజనేయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు..



ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో..

సదాశివనగర్: మండలంలోని ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం యోసెఫ్, పీడీ శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అలేఖ్య, చంద్రకాంత్, సాత్విక, శ్రావణ్ ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 7,8,9,10వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు..

నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేట హై స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, పీడీ సబాత్‌కృష్ణ తెలిపారు. ఈ నెల 7న మేడ్చల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో కె అంకిత, ఎం కార్తీక్‌లు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను హెచ్‌ఎం,ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు..

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది జెడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థిని కడావత్ బిందు రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన పరుగుపందెంలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థిని బిందును ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ నజీమాబేగం, ఉపాధ్యాయులు మహేశ్, నయన్‌కుమార్, పుష్పలత, విఠల్‌రెడ్డి, శంకర్, ప్రవీణ్, ఆనంద్, రాజేశ్వర్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మ విషయంలో ఘర్షణ



గాయాలపాలైన వెంకట్‌గౌడ్

బీబీపేట: మేకలకు చెట్టు కొమ్మ తీసుకునే విషయంలో ఘర్షణ పడి ఒకరిపై మరొకరు పిడిగుద్దులతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని తుజాల్‌పూర్ గ్రామ శివారులో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దోమకొండ మండలం అంబారిపేటకు చెందిన రాజశేఖర్‌గౌడ్ నూతన గృహ ప్రవేశం ఉండడంతో ఆయనతోపాటు అతడి అన్న సంజీవ్‌గౌడ్, మామ వెంకట్‌గౌడ్, తమ్ముడు అక్షిత్‌గౌడ్ కలిసి వాహనంలో దుబ్బాకకు వెళ్లి మేకలు కొనుగోలు చేసుకుని వస్తున్నారు. తుజాల్‌పూర్ శివారులో వాహనాన్ని ఆపి మేకల కోసం రోడ్డు పక్కన ఉన్న చెట్టు కొమ్మలు తెంపుతుండగా తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన తలారి బాబు, అనంతయ్య, కమలాకర్, సూర్యం, దివాకర్, కుమార్ అక్కడకు చేరుకొని వారితో ఘర్షణ పడ్డారు. ఇక్కడ చెట్టు కొమ్మలు తీయడానికి వీలులేదని దుర్భాషలాడుతూ దాడి చేశారు. ఈ ఘటనలో వెంకట్‌గౌడ్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే పోలీసులకు ఫోన్ చేయడంతో ఇరువురిని పోలీసు స్టేషన్‌కు రప్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

బాన్సువాడ/పిట్లం/బీబీపేట/బోధన్‌రూరల్: బాన్సువాడ పట్టణంతోపాటు పిట్లం, బీబీపేట, బోధన్ రూరల్ మండలాల్లో పేకాటస్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని కొయ్యగుట్ట సమీపంలో కొనసాగుతున్న పేకాట స్థావరంపై దాడి చేసి 13 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.34వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పిట్లం మండలంలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయా చోట్ల 18 మందిని అరెస్టు చేసి రూ.14వేల నగదు, 18 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బీబీపేట మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరిచామన్నారు. బోధన్ మండలంలోని కొప్పర్గ గ్రామంలో పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.93,730 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.